# ముగాబే.. సంగిరాయ్... ముగిసిన జింబాబ్వే సంక్షోభం

**జింబాబ్వేలో గత ఎనిమిదేళ్లుగా నెలకొన్న రాజకీయ సంక్షోభం ఓ కొలిక్కి వచ్చింది. అధికార, ప్రతిపక్షాల మధ్య.. ఐక్యరాజ్య సమితి, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు థాబో ఎంబెకీ సమక్షంలో... కుదిరిన ఒప్పందంతో సంక్షోభం తాత్కాలికంగా ముగిసినట్లయింది. జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే.. ప్రతిపక్ష నాయకుడు మోర్గన్ సంగిరాయ్.. మరో ప్రతిపక్ష నేత ఆర్థర్ ముతంబార... అధికార పంపిణీ ఒప్పందంపై సంతకాలు చేశారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు థాబో ఎంబెకీ సమక్షంలో... జింబాబ్వే రాజధాని హరారేలో ఈ చారిత్రాత్మక ఒప్పందం జరిగింది.**

అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే మాట్లాడుతూ... అన్ని రాజకీయ పక్షాల నాయకులూ ఒకే తాటిపై నడవాలనీ.. విభేదాలు విస్మరించి, జాతీయ పునర్నిర్మాణానికి అంకితం కావాలనీ.. అప్పుడే ఈ చారిత్రాత్మక ఒప్పందం అమలు సులభతరమవుతుందనీ పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత మోర్గన్ సంగిరాయ్ మాట్లాడుతూ... రాజకీయ పక్షాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం.. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ఆశాజనకమైన పురోగతి అని అభిప్రాయ పడ్డారు. మరో ప్రతిపక్ష నాయకుడు ఆర్థర్ ముతంబార కూడా ఈ ఒప్పందం అమలుకు అన్ని రాజకీయ పక్షాలూ చిత్తశుద్ధితో కృషిచేస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం మీద అన్ని పక్షాలూ ఇచ్చిపుచ్చుకునే తీరున వ్యవహరించాయి. ఒప్పందం లోని కొన్ని విషయాల్లో సంతృప్తితో ఉన్నా.. ఒప్పందంలోని మరికొన్ని అంశాల పట్ల అసంతృప్తి కూడా ఉందని... అయితే దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తామంతా కలిసి పనిచేస్తామంటూ నాయకులందరూ ప్రకటించారు.

## ఒప్పందం ముఖ్యాంశాలు:

- దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక, రాజకీయ సంక్షోభాల నేపథ్యంలో... అన్ని పక్షాలూ దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని.. అందరికీ ఆమోదయోగ్యమైన, శాశ్వతమైన పరిష్కారాలను కనుక్కోవటానికి కలిసి పని చేయాలి.
- దేశాధ్యక్షుడిగా రాబర్ట్ ముగాబే కొనసాగుతారు. దేశ ప్రధానమంత్రిగా మోర్గన్ సంగిరాయ్ బాధ్యతలు చేపడతారు. దేశాధ్యక్షుడు కేబినెట్ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.. త్రివిధ దళాల అధ్యక్షులతో కూడి, నేషనల్ సెక్యూరిటీ కౌన్సెల్‌కు అధ్యక్షత వహిస్తారు..



రాబర్ట్ ముగాబే



మోర్గాన్ సంగిరాయ్

దేశంలో అంతిమ కార్య నిర్వహణాధికారాన్ని కలిగి ఉంటారు.. దేశ రాజ్యాంగానికి అనుగుణంగా అత్యవసర పరిస్థితిని విధించే అధికారం, కేబినెట్‌లోని మంత్రులకు శాఖలను అప్పగించే అధికారాన్ని కలిగి ఉంటారు. కేబినెట్‌కు అధ్యక్షత వహిస్తారు. ప్రధాన మంత్రి సలహాకు అనుగుణంగా పార్లమెంటును రద్దుచేసే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. దేశ ప్రయోజనార్థం ప్రధానమంత్రి లేదా ఇతర ఏ మంత్రి నుంచి అయినా అవసరమైన సమాచారాన్ని తెప్పించుకోవచ్చు.

- మోర్గాన్ సంగిరాయ్ జింబాబ్వే ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపడతారు. మంత్రివర్గ నాయకుడిగానూ.. కేబినెట్ సమావేశాలకు ఉపాధ్యక్షుడిగాను ఉంటారు. దేశంలో రోజువారి పరిపాలన, అంతర్గత భద్రత, ఆర్థిక పునఃవ్యవస్థీకరణ మొదలైన అంశాలను ప్రధాని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉంటారు. దేశ పాలనావ్యవహారాల విషయంలో పార్లమెంటుకు, దేశాధ్య క్షుడికి జవాబుదారుడిగా ఉంటారు.
- అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే.. అధికార ZANU-PF (Zimbabwe African National Union Patriotic Front) పార్టీ నుంచి ఇద్దరిని ఉపాధ్యక్ష పదవులకు నామి నేట్ చేస్తారు.
- ప్రతిపక్ష పార్టీ అయిన MDC (Movement for Democratic Change) రెండు గ్రూపులుగా ఉన్న మోర్గాన్ సంగిరాయ్ వర్గం నుంచి ఒకరు.. ఆర్థర్ ముతంబారా వర్గం నుంచి మరొకరు... దేశ ఉప ప్రధానులుగా నామినేట్ అవుతారు.
- మంత్రి వర్గంలో 31 మంది మంత్రులు ఉంటారు. వీరిలో 15 మంది అధికార ZANU-PF పార్టీకి చెందినవారైతే... 13 మంది MDC సంగిరాయ్ వర్గీయులు. ముగ్గురు MDC ముతంబారా వర్గానికి చెందినవారు. 31 మంది సభ్యులున్న మంత్రివర్గంలో ముగ్గురిని పార్లమెంటు సభ్యులు కానివారిని కూడా చేర్చుకోవచ్చు. వీరికి పార్లమెంటులో కూర్చొని అక్కడ జరిగే చర్చల్లో పాల్గొనే హక్కు ఉంటుంది. కానీ, ఓటు వేసే హక్కు ఉండదు. మంత్రి వర్గంలో 31 మంది మంత్రులతోపాటు 15 మంది ఉపమంత్రులు కూడా ఉంటారు. వీరిలో 8 మంది ZANU-PF పార్టీకి చెందిన వారు. ఆరుగురు MDC సంగిరాయ్ వర్గీయులు. ఒకరు MDC

SAKSHI

ముతంబారా వర్గానికి చెందినవారు. మంత్రులను కాని, ఉప మంత్రులను కాని తొలగించాలంటే... మూడు పార్టీలు చర్చించి, సమష్టి నిర్ణయం ద్వారానే తొలగించే వీలవుతుంది.

- దేశాధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, ప్రధానమంత్రి, ఉపప్రధాన మంత్రులు, అందరూ.. ఈ ఒప్పందం స్ఫూర్తిని గౌరవిస్తూ.. ఒప్పందంలో పొందుపరచిన, నిబంధనలకు లోబడే వ్యవహరించాల్సి ఉంటుంది.
- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా... దేశ సామాజిక, ఆర్థిక అవసరాలను తీర్చడం కోసం పార్లమెంటులో ఎంపిక చేసిన సభ్యులతో కూడిన ఒక నిపుణుల కమిటీ.. రెండు నెలల్లోగా కొత్త రాజ్యాంగ రూపకల్పనకు ఉపక్రమిస్తుంది. ఈ కమిటీ రూపొందించిన రాజ్యాంగాన్ని రిఫరెండం ద్వారా ఆమోదించాల్సి ఉంటుంది.
- ప్రజలందరికీ వాక్ స్వాతంత్ర్యం.. స్వేచ్ఛగా రాజకీయ పార్టీ లలో సభ్యత్వాన్ని నమోదు చేసుకోవటానికి.. తమ అభిప్రాయాలను వ్యక్తం చేయటానికి.. సభలను ఏర్పాటు చేసుకోవటానికీ.. అవకాశం కల్పించడం ద్వారా... బహుపార్టీల ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేయాలని ఒప్పందం పేర్కొంటోంది. అంతేకాక దేశంలోని పోలీస్, తదితర పరిపాలనా వ్యవస్థలోని ఉద్యోగులందరూ తటస్థ వైఖరి అవలంభించేందుకు శిక్షణనివ్వటం ద్వారా.. బలమైన ప్రజాస్వామ్యానికి అవసరమైన తటస్థ శాశ్వత కార్యనిర్వా హక వ్యవస్థను తయారు చేయటానికి అన్ని పార్టీలు సహకారాన్ని అందించాలి.
- జింబాబ్వే అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకొనే హక్కు.. అధికార మార్పును డిమాండు చేసే హక్కు.. ఏ ఇతర దేశానికీ లేదని ఒప్పందం పేర్కొంది. అంతేకాకుండా జింబాబ్వే అంతర్గత వ్యవహారాలన్నింటిలో దేశ ప్రభుత్వం, దేశ ప్రజలదే అంతిమ నిర్ణయమని స్పష్టం చేసింది. దేశంలో ప్రజాస్వామ్యం, భూసంస్కరణలు, జాతి వివక్ష, ఎన్నికల్లో అవకతవకలు, కుపరిపాలన వంటి అంశాల ఆధారంగా.. యూరోపియన్ యూనియన్, అమెరికా, బ్రిటన్ తదితర దేశాల ఆర్థిక ఆంక్షలతో జింబాబ్వే ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని... దీన్ని చక్కదిద్దేందుకు వీలుగా అంతర్జాతీయ సమాజాన్ని ఒప్పించి... ఆంక్షలను ఎత్తివేసే దిశగా అన్ని పార్టీలు కలిసి ముందుకు నడవాలని నిర్ణయించారు. అన్ని పార్టీలు సమష్టి ప్రయత్నం, దృఢమైన వ్యూహం, ప్రణాళికల ద్వారా... ఆర్థిక వ్యవస్థను పురోగమన దిశలో నడిపించాలని నిర్దేశించారు.
- వలస పాలనలో (బ్రిటిష్ పాలన) భూ పంపిణీ, భూ యాజమాన్యంలో చోటుచేసుకున్న వివక్షతలను తొలగించటానికి భూ సంస్కరణలు అనివార్యమని ఒప్పందంలో పేర్కొన్నారు. దాంతో పాటు ఈ భూసంస్కరణల ప్రక్రియలో భూమిని సేకరించి భూమి లేని పేదలకు పంచే ప్రక్రియ నిరాటంకంగా కొనసాగాలన్నారు. అయితే, ఈ వివక్షతకు కారణమైన వలస పరిపాలకులే సంబంధిత భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. భూ సంస్కరణలు సమర్థవంతంగా అమలుచేయటానికి సమగ్రమైన, పారదర్శకమైన, నిష్పాక్షికమైన భూమి ఆడిట్ (Audit) జరిపించి తద్వారా ఒకే వ్యక్తి అనేక భూభాగాలను కలిగి ఉండే వ్యవస్థను రూపుమాపాలని... దీనికి అన్ని పార్టీలు కలిసి కట్టుగా సహకరించాలని ఒప్పందంలో పేర్కొన్నారు.

## సంక్షోభం ఎందుకు ఏర్పడింది?

విక్టోరియా జలపాతాలతో ప్రపంచపటంలో గుర్తింపుపొందిన జింబాబ్వేను గతంలో రొడీషియాగా పిలిచేవారు. 19వ శతాబ్దం నుంచి ఐరోపా వర్తకుల రాకతో నల్లజాతీయుల దేశమైన జింబాబ్వేలో.. క్రమేణా శ్వేత జాతీయుల వలస మొదలైంది. భారతదేశంలో లాగానే వర్తకానికి వచ్చిన జాన్‌రోడ్స్ అనే శ్వేత జాతీయుడి కంపెనీ... 'బ్రిటిష్ సౌత్ ఆఫ్రికా కంపెనీ' అక్కడ భూభాగాన్ని పాలించే హక్కును సంపాదించింది. జాన్‌రోడ్స్ పేరు మీదగానే రొడీషియా అయింది. 1922లో బ్రిటిష్ సౌత్ ఆఫ్రికా పాలన అంతమై... మైనార్టీగా ఉన్న శ్వేతజాతీయుల పాలన ఆరంభమైంది. 1930నాటి భూపరిమితి చట్టం ద్వారా.. నల్లజాతీయులకు భూ యాజమాన్య హక్కు లేకుండా, వారిని భూ కార్మికులుగానే గుర్తించటం జరిగింది. 1960లలో శ్వేత జాతీయుల పాలనకు వ్యతిరేకంగా Zimbabwe African National Union (ZANU) వంటి జాతీయ పార్టీలు పోరాటం చేశాయి. శ్వేత జాతీయుడైన Ian Smith ప్రధానమంత్రిగా.. అప్పటివరకు దక్షిణ రొడీషియాగా కొనసాగిన జింబాబ్వే.. 1964లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంది. స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాక కూడా శ్వేత జాతీయుల పాలన కొనసాగటంతో... దేశంలో అంతర్యుద్ధం మొదలైంది. ఈ నేపథ్యంలో... 1979లో లండన్‌లో భిన్న పక్షాల మధ్య జరిగిన చర్చల ద్వారా శాంతి ఒప్పందం జరిగింది. మైనార్టీల హక్కులను కాపాడే నిబంధనలను కలిగిన కొత్త రాజ్యాంగాన్ని అన్ని పక్షాలు ఆమోదించాయి.

స్వాతంత్ర్యం తరువాత 1980లో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో... రాబర్ట్ ముగాబే ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1987లో రాజ్యాంగంలో కొన్ని మార్పులు తీసుకు వచ్చి జెడ్‌ఏఎన్‌యూ–పీఎఫ్ పార్టీకి చెందిన రాబర్ట్ ముగాబే దేశాధ్యక్షుడయ్యారు. అయితే, ఆయన దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకోవడంలో విఫలమయ్యారు. దాంతో ఆర్థిక వ్యవస్థ దిగజారటం ప్రారంభమైంది. 1999 నాటి నుంచి ఆర్థికాభివృద్ధి బాగా క్షీణించడంతోపాటు ప్రజల్లో వ్యతిరేకత కూడా మొదలైంది. వీటన్నింటి పర్యవసానంగా మోర్గన్ సంగిరాయ్ నేతృత్వంలో... మూవ్‌మెంట్ ఫర్ డెమొక్రాటిక్ ఛేంజ్–ఎండీసీ ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. 2000లో జరిగిన రిఫరెండం ద్వారా రాజ్యాంగాన్ని మార్చాలనుకున్న ముగాబే ప్రయత్నం ఫలించలేదు. ఎందుకంటే... ఆయన నిర్ణయానికి ప్రజల మద్దతు లభించలేదు. రిఫరెండంలో పరాజయం పాలవడం ముగాబేకు మొదటి ఎదురుదెబ్బ.

2000లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ముగాబే నేతృత్వ లోని జెడ్‌ఏఎన్‌యూ–పీఎఫ్ పార్టీ స్వల్ప మెజార్టీ పొందినా.. రాజ్యాంగాన్ని మార్చేందుకు అవసరమైన సంఖ్యాబలాన్ని సాధించలేకపోయింది. రిఫరెండంలో పరాజయం.. పార్లమెంటు ఎన్నికల్లో చావుతప్పి

SAKSHI

కన్నులొట్టపోవటంతో పడిపోతున్న తన జనాదరణ నిలబెట్టుకోవడానికి... శ్వేతజాతీయుల భూభాగాలను నిర్భయంగా ఆక్రమించుకోవాల్సిందిగా తన పార్టీ కార్యకర్తలకు ముగాబే పిలుపునిచ్చారు. శ్వేత జాతీయులపై దాడులు.. వారి భూభాగాలను బలవంతంగా ఆక్రమించుకోవటం.. తత్ఫలితంగా జరిగిన హింసాత్మక చర్యల కారణంగా పాశ్చాత్య దేశాలు జింబాబ్వేపై ఆర్థిక ఆంక్షలు విధించాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు కూడా ఆ దేశానికి అందించే ఆర్థిక సహాయాన్ని కుదించివేశాయి. 2002లో అధ్యక్ష ఎన్నికల సందర్భంగా మీడియాపై ఆంక్షలు విధించారు. దాంతో యూరోపియన్ యూనియన్ కూడా జింబాబ్వేపై ఆంక్షలు విధించింది. ఎన్నికల్లో అనేక అక్రమాలు జరిగాయని ప్రతిపక్ష పార్టీలు ఏకరువు పెట్టినా... తిరిగి తానే అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ముగాబే ప్రకటించుకున్నారు.మళ్లీ అధ్యక్షుడైన ముగాబే... 45 రోజుల్లోగా శ్వేతజాతీయులందరూ తమ భూమిని అప్పగించాలన్న భూసే కరణ చట్టం తేవడంతో మళ్లీ వివాదం మొదలైంది. ఎన్నికల్లో అవకతవకలు, ప్రతిపక్షాలను అణగదొక్కటం లాంటి ప్రజాస్వామిక వ్యతిరేక చర్యలకు పాల్పడటంపై.. 2002లోనే జింబాబ్వేను కామన్వెల్త్ (గతంలో బ్రిటీష్ పాలనలో ఉండి.. తర్వాత స్వాతంత్ర్యాన్ని పొందిన దేశాల సమాఖ్య) నుంచి సస్పెండ్ చేశారు. మరో మారు 2003లోనూ నిరవధికంగా సస్పెండ్ చేయడంతో.. కామన్వెల్త్ నుంచి జింబాబ్వే తన సభ్యత్వాన్ని ఉపసంహరించుకుంది. 2004లో ప్రతిపక్షనాయకుడు మోర్గాన్ సంగిరాయ్‌పై దేశద్రోహ నేరాన్ని ఆపాదించి, విచారించడం మొదలైంది. 2005లో పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న చిన్నచిన్న దుకాణాలను, గృహాలను (ప్రతిపక్ష పార్టీలకు వారి మద్దతు లభించడం వల్ల) అక్రమంగా నిర్మించారంటూ... వాటన్నింటినీ ప్రభుత్వం వివక్షంగా కూల్చివేయడంతో దాదాపు 7 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఇలా ఓ వైపు రాజకీయ సంక్షోభం కొనసాగుతుంటే.. మరోవైపు ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం వెయ్యి (1000 శాతం) శాతానికి చేరింది. అదే సమయంలో పాశ్చాత్య దేశాల ఆంక్షలు యథాతథంగా ఉంటూ వచ్చాయి. 2008, మార్చిలో జరిగిన అధ్యక్ష ఎన్నికలు, పార్ల మెంటు ఎన్నికల్లో కూడా... ప్రతిపక్ష పార్టీ అయిన ఎండీసీ(సంగిరాయ్) స్వల్ప మెజారిటీ సాధించింది. అయితే, అధ్యక్షుడిగా ఎన్నికవటానికి అవసరమైన ఓట్ల శాతం సంగిరాయ్‌కు లభించలేదు. దాంతో ముగాబే, సంగిరాయ్‌ల మధ్య మళ్లీ అధ్యక్ష ఎన్నిక అనివార్యమైంది. అయితే, తమ పార్టీ కార్యకర్త లందరినీ బెదిరించి, భయభ్రాంతుల్ని చేస్తున్నారనీ.. అధ్యక్షుడు ముగాబే ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం వల్ల నిష్పాక్షిక ఎన్నికలు సాధ్యకాదంటూ... మళ్లీ అధ్యక్ష ఎన్నికలు జరగటానికి కొన్ని రోజుల ముందు సంగిరాయ్ ఎన్నికల బరి నుంచి వైదొలిగారు. దాంతో 2008, జూన్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో.. ముగాబే ఆరోసారి జింబాబ్వే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

దేశంలో ద్రవ్యోల్బణం 20 లక్షల శాతానికి చేరింది. అమెరికా, బ్రిటన్ తదితర ఐరోపా దేశాల ఒత్తిడి.. దేశంలో నెలకొన్న రాజకీయ సంక్షోభం.. రోజురోజుకూ తగ్గిపోతున్న జనాదరణ.. ప్రజల్లో కోల్పోతున్న పట్టు... విపక్షాలతో సామరస్యపూర్వక ఒప్పందం చేసుకొని, అధికారాన్ని పంచుకోవాలన్న ఆఫ్రికన్ యూనియన్ (ఆఫ్రికా దేశాల సమాఖ్య) ఒత్తిడి... తదితర కారణాలతో జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే, ప్రతిపక్ష నేత సంగిరాయ్‌తో చర్చలు జరపటానికి 2008, ఆగస్టులో అంగీకరించారు. దాంతోపాటు ప్రతిపక్ష పార్టీ అయిన ఎండీసీ (సంగిరాయ్)కి పార్లమెంటు ఎన్నికల్లో మెజార్టీ లభించడంతో... ఆ పార్టీకి చెందిన లవ్‌మోర్‌మోయో పార్లమెంటు స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఇది కూడా ముగాబేకు ప్రతికూల పరిణామంగా మారింది. ఇవన్నీ కలిసి ఆయన్ను ప్రతిపక్ష నాయకులతో కలిసి చర్చలు జరిపి ఒప్పందం కుదుర్చుకునేలా చేశాయి.

### భూసంస్కరణలు ఎందుకు వివాదాస్పదమయ్యాయి?:

జింబాబ్వేలో అత్యధిక శాతం సారవంతమైన భూమి మైనార్టీలైన శ్వేత జాతీయుల అధీనంలో ఉంది. 4,400 మంది శ్వేత వ్యవసాయదారుల అధీనంలో... 32 శాతం వ్యవసాయ భూమి (దాదాపు 10 మిలియన్ హెక్టార్లు) ఉంది. దాదాపు 10 లక్షల మంది నల్ల వ్యవసాయదారుల అధీనంలో... 38 శాతం వ్యవసాయ భూమి (దాదాపు16 మిలియన్ హెక్టార్లు) ఉంది. అయితే, శ్వేతజాతీయుల అధీనంలో ఉన్న భూభాగం.. మంచి సారవంతమైందే కాకుండా, చక్కని వర్షపాతాన్ని పొందే నేల. నల్లజాతీయుల అధీనంలో ఉన్న భూమి తరచూ వర్షాభావ పరిస్థితిని ఎదుర్కొంటూ.. కరవుపీడిత ప్రాంతంగా ఉంది. వేల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లను కలిగి, యంత్రాల సహాయంతో వ్యవసాయాన్ని చేసే శ్వేతజాతీయులు ఒకవైపు... చిన్న గుడిసెలో ఉంటూ.. పొట్ట కోసం పొలంలో పగలు రాత్రీ కష్టపడే నల్లజాతి వ్యవసాయదారులు మరో వైపు... ఇలా రెండు వర్గాలుగా జింబాబ్వే వ్యవసాయదారులు ఉంటూ వచ్చారు. ఈ పరిస్థితి శ్వేతజాతీయుల పాలన ఆరంభమైనప్పటి నుంచి కొనసాగుతూ వచ్చింది. జింబాబ్వేలో ప్రజల స్వాతంత్ర్యానికి ప్రేరేపించిన కారణాల్లో భూ సమస్య అతిముఖ్యమైంది. దేశంలో భూసంస్క రణలను అమలు చేయాలంటే... శ్వేతజాతీయుల భూములను సేకరించి, వాటిని భూమిలేని నల్లజాతీయులకు పంపిణీచేయాల్సి ఉంటుంది. అయితే, ఇలా సేకరించిన భూమికి ప్రతిఫలంగా నష్టపరిహారం శ్వేతజాతీయులకు ఎవరు చెల్లించాలన్నది వివాదాస్పదంగా మారింది. బ్రిటీష్ వారి పాలనలోనే ఈ సమస్య మొదలైంది, కాబట్టి బ్రిటీష్ వారే ఈ నష్టపరిహారాన్ని చెల్లించాలని ముగాబే వాదిస్తున్నారు. దీనికితోడు తరతరాలుగా తాము అభివృద్ధి చేసుకుంటూ వచ్చి.. అక్కడ చక్కటి వసతులు ఏర్పాటు చేసుకున్న తరువాత... ఇప్పుడు తమ భూభాగాలను ఆక్రమించుకుంటే, ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే... తమ గతి ఏమి కావాలన్న శ్వేతజాతీయుల ఆందోళన, సమస్యను మరింత జటిలం చేసింది. భూ సంస్కరణల అమలుకోసం బ్రిటన్ ప్రభుత్వం దాదాపు 44 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించింది. దీన్ని జింబాబ్వే ప్రభుత్వంలోని మంత్రులు, అవినీతి అధికారులు దుర్వినియోగం చేశారు. దాంతో మరింత సాయం చేసేందుకు బ్రిటన్ నిరాకరిస్తోంది. మరోవైపు తగ్గుతున్న తన జనాదరణను

SAKSHI

నిలబెట్టుకోవడానికి... శ్వేతజాతీయుల వ్యవసాయ భూములను ఆక్ర మించుకోవాల్సిందిగా... దేశాధ్యక్షుడు ముగాబే తన పార్టీ కార్యకర్తల కు పిలుపివ్వడం.. ఆర్థిక సమస్యతోపాటు శాంతిభద్రతల సమస్యకు కూడా దారితీసింది.

## భవిష్యత్తు ఏంటి?:

ప్రస్తుతం కుదిరిన ఒప్పందం అన్ని పార్టీలకు కొంత సంతృప్తితో పాటు అసంతృప్తిని కూడా మిగిల్చింది. అయితే, దీన్ని చిత్తశుద్ధి తో అమలు చేస్తే మాత్రం జింబాబ్వే భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుంది. దేశంలో ప్రజాస్వామ్యం బలపడి, అంతర్జాతీయ మద్దతు పొందగలిగితే... జింబాబ్వేపై పలు దేశాలు విధించిన ఆర్థిక, రాజకీయ ఆంక్షలు తొలిగి పోతాయి. ఆయా దేశాల నుంచి ఆర్థిక సాయం ఇతోధికంగా లభించే అవకాశం లేకపోలేదు. అంతేకాక, అంతర్జాతీయ సంస్థలైన అంతర్జా తీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకులు... జింబాబ్వే ఆర్థిక వ్యవస్థ పున ర్నిర్మాణానికి ప్యాకేజీ ప్రకటించే అవకాశముంది. శ్వేత జాతీయులకు, నల్లజా తీయులకు ఆమోదయోగ్యంగా ఉండే భూసంస్కరణల ప్రక్రియ అమలైతే... ప్రాథమిక రంగమైన వ్యవసాయ రంగంలో ఆశిం చిన అభివృద్ధి జరిగి, వస్తుసేవల ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా ద్రవ్యోల్బణం తగ్గి, ఆర్థిక స్థితి కుదుటపడే అవకాశముంది!!

SAKSHI